సున్నంచెరువు వద్ద కుచించుకుపోయిన

నాలాపై కల్వర్టు

● వర్షం వస్తే వాహనాల మునక.. పొంచి ఉన్న ప్రమాదం



సున్నంచెరువు వద్ద కుచించుకుపోయిన నాలా

హైటెక్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బోరబండ సైట్-3 నుంచి హైటెక్ సిటీ వెళ్లే మార్గం సున్నంచెరువు వద్ద నాలాపై వేసిన కల్వర్టు శిథిలమై కుచించుకుపోయింది. నవభారత్ నగర్ వరకు జరిగిన రోడ్డు విస్తరణ కల్వర్టు వద్ద జరగకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు వెళ్లే మార్గంలో రహదారి విస్తరణ జరగకపోవడంతో నాలా నుంచి వెళ్లే మురుగునీరు గుంతల్లో చేరి అక్కడ గుంత ఉందన్న విషయం తెలియడం లేదు. దాంతో వర్షం వచ్చినప్పుడు వాహనాలు మురుగునీటిలో మునిగిపోతున్నాయి. అంతే కాదు ద్విచక్ర వాహనాల చక్రాలు గుంతల్లో పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు.

అసలే ఇరుకు రోడ్డు.. ఆ పై మురుగు కాల్వ

ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ మార్గంలో వేలాది వాహనదారులు ప్రయాణం సాగిస్తారు. ద్విచక్ర వాహనాలు వెళ్లే ఈ రహదారిలో కార్లు బారులు తీరుతున్నాయి. అటు-ఇటు ఒకేసారి ఫోర్ వీలర్స్ వస్తే ట్రాఫిక్‌జామ్ కావాల్సిందే. అసలే ఇరుకు రోడ్డు, ఆ పై ఒక వైపు ఉన్న మురుగు కాల్వపై ఎటువంటి పై కప్పు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం పడినప్పుడు పరిస్థితి ఇంకా దారుణంగా మారుతోంది. నాలా నుంచి వరదనీరు రోడ్లపైకి వస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నాయి. ట్రాఫిక్‌జామ్ అవుతోంది.

రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల బార్డర్

సున్నంచెరువు నుంచి బోరబండ సైట్-3 వరకు రోడ్డు విస్తరణ జరిగింది. అక్కడ ఒక బ్రిడ్జి కూడా ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ మండలంలో బోరబండ సైట్-3 ఉండగా, శేరిలింగంపల్లి మండలంలో నవభారత్ నగర్ ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల బార్డర్‌లో ఈ కల్వర్టు ఉంది. ఈ మార్గంలో మాదాపూర్ వెళ్లే వారంతా కల్వర్టు వద్ద ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే ఈ సమస్య మరింత పెరుగుతోంది. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు సమస్యను గుర్తించి త్వరగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

5 లక్షల మంది పేదలకు ఇళ్లు

● మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 5 లక్షల మంది పేదలకు ఇళ్లు కట్టించేందుకు సిద్ధంగా ఉందని ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నగర శివారు పెద్దఅంబర్‌పేట్‌లోని తారా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీధర్‌బాబుతో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 10,050 మంది లబ్ధిదారులకు మంజూరైన రేషన్‌కార్డులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న కవితారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బంజారాహిల్స్ పోలీసులకు కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి శనివారం ఫిర్యాదు చేశారు. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్‌ను విమర్శించడమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

డెంగీ నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో డెంగీ వ్యాధి నివారణ కోసం పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్(హెల్త్) సీఎన్ రఘుప్రసాద్ అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్‌లో ఇద్దరికి డెంగీ పాజిటివ్ రావడంతో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలతో రఘుప్రసాద్ శనివారం సనత్‌నగర్‌లో పర్యటించారు. ఎస్ఆర్‌టీ కాలనీలో డెంగీ బాధితులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. డెంగీ కేసులు నమోదైన కాలనీలో జ్వరపీడుతులు, అనుమానితులకు డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెల్త్ జాయింట్ కమిషనర్ శంకర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ముదిరాజ్ సంఘం

రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా లక్ష్మీముదిరాజ్



లక్ష్మీముదిరాజ్

పంజాగుట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జగన్‌మోహన్ ముదిరాజ్ ఆమెకు సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ తమ సామాజిక వర్గాన్ని బీసీ-డి గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ముదిరాజ్ సామాజిక వర్గానికి ఇచ్చిన అన్ని హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో

ఐదుగురికి జైలు.. 29 మందికి జరిమానా

ఖైరతాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 34 మందిని సైఫాబాద్ పోలీసులు శనివారం కోర్టుకు తరలించారు. నాంపల్లి 10వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఐదుగురికి జైలు శిక్షతో పాటు జరిమానా, మిగతా 29 మందికి జరిమానాలు విధించింది. 29 మందికి రూ.3,100, ముగ్గురికి రూ.4300 జరిమానాతోపాటు ఆరు రోజులు జైలు శిక్ష, ఒకరికి రూ.6,300 జరిమానా, ఆరు రోజులు శిక్ష, మరొకరికి రూ.3,300 జరిమానాతోపాటు ఆరు రోజులు జైలు శిక్షను విధించినట్లు సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు.

ప్రేమ, పెళ్లి పేరుతో లైంగిక దాడి

అమీర్‌పేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమించానని.. పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి.. మోజు తీర్చుకుని మోసం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన యువతి(25) దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. రెండేళ్ల క్రితం ఆమెకు అలీపురం తరుణ్ పరిచయమయ్యాడు. గత జనవరి 29వ తేదీన యువతి పుట్టినరోజు నాడు తరుణ్ ప్రేమను ప్రపోజ్ చేశాడు. ఆమె అంగీకరించింది. ఈనెల 20వ తేదీన బేగంపేట్ లోని ఓయో టౌన్ విల్లాకు తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి బలవంతంగా లైంగిక సంబంధాన్ని పెట్టుకున్నాడని.. ఆ తర్వాత నుంచి ఫోన్ కాల్స్ రిసీవ్ చేసుకోవడం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బాధిత యువతి ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో రైలులో యువతికి వేధింపులు

● చెంపదెబ్బ కొట్టిన తోటి ప్రయాణికుడు

అమీర్‌పేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలులో ప్రయాణిస్తున్న ఓ యువతి పట్ల ప్రయాణికుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూబోయిన్‌పల్లికి చెందిన యువతి(25) ఈనెల 24వ తేదీ రాత్రి బంజారాహిల్స్ నుంచి ప్యారడైజ్ కు వెళ్లేందుకు మెట్రో రైలు ఎక్కింది. రైలు అమీర్‌పేట స్టేషన్ చేరుకున్నప్పుడు అపరిచిత ప్రయాణికుడు ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. నిలదీసిన యువతితో దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడి చెంపదెబ్బ కొట్టాడు. యువతి తన ఫోన్‌లో వీడియో రికార్డు చేయడం ప్రారంభించడంతో ఆ పోకిరి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కలెక్టర్ హరిచందనను కలిసిన ఖబరస్తాన్ కమిటీ ప్రతినిధులు

బోరబండలో ఖబరస్తాన్‌కు స్థలం కేటాయించాలి

బోరబండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఖబరస్తాన్ కోసం స్థలం కేటాయించాలని బోరబండ ఖబరస్తాన్ కమిటీ ప్రతినిధులు హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరిని కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమెను కలిసిన కమిటీ ప్రతినిధులు మరుభూమికి చోటు లేనందున బోరబండ డివిజన్‌వాసులు పడుతున్న కష్టాలను వివరించారు. డివిజన్‌లోని 23 బస్తీలకు చెందిన ముస్లింల ఇంట్లో ఎవరైనా మరణిస్తే ఆ బాధతో పాటు ఎక్కడ ఖననం చేయాలన్న విషయంలో మరింత బాధ కలుగుతోందని తెలిపారు. కాగా, దారుస్సలాంలో మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కమిటీ ప్రతినిధులు కలిసి స్థలం కేటాయించాలని కోరగా, కలెక్టర్‌కు లేఖ రాశారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం.డి.అఫ్జలుద్దీన్ దఖినీ, బోరబండ ఖబరస్తాన్ కమిటీ ప్రతినిధులు సయ్యద్ ముకరం, షేక్ షరీఫ్ పటేల్, జహంగీర్ ఖాన్, ఎం.డి.మోయిజ్, ఫయాజ్ ఖాన్, షేక్ షరీఫ్, వసీం జావెద్, ఎం.డి.యూసుఫ్, జావెద్ ఖాన్, మునీర్ పాల్గొన్నారు.

విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డు



జస్టిస్ లక్ష్మీనారాయణ నుంచి అవార్డును అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాసరావు

పంజాగుట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ పది సంవత్సరాలుగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డులను అందజేస్తోంది. హెల్త్ కేర్ విభాగంలో విశేష సేవలందించిన ఎస్ఆర్ నగర్‌లోని మాగ్నిస్ డయాగ్నస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సింగం శ్రీనివాసరావు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఉత్తమ ఆరోగ్య సంరక్షణ ప్రదాత అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం బాచుపల్లిలోని ఓ హోటల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ, సంస్థ వ్యవస్థాపక సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి నిర్వహించిన 1250 ఉచిత వైద్య శిబిరాల ద్వారా 2.15 లక్షల మంది లబ్ధి పొందారని డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.



కళాకారుల నృత్యప్రదర్శన

భారతీయ నృత్యన్వయ మహోత్సవం

మాదాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ, కిరణ్మయి బోనాల ఆధ్వర్యంలో రెండు రోజుల 'భారతీయ నృత్యన్వయ మహోత్సవం' ఎ ఫెస్టివల్ ఆఫ్ పరంపర ఉత్సవాన్ని శనివారం ప్రారంభించారు. పద్మశ్రీ డాక్టర్ పద్మజరెడ్డి శిష్య బృందం 'కాకతీయం' నృత్యం ప్రదర్శించారు, కిరణ్మయి బోనాల కుమార్తెలు, పదవర్ణం, రామచరితం ప్రదర్శించారు. ప్రెసిడెంట్ ప్రజ్ఞాభారతి శ్రీనివాస్, వెంకటప్రగడ కళాకారులను, గురువులను సత్కరించారు.

లా పూర్తి చేసిన వారికి ఉచిత శిక్షణ

● ఆగస్టు 10 వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'లా' పూర్తి చేసిన అభ్యర్థులకు మూడేళ్ల ఉచిత శిక్షణ ఇవ్వడానికి హైదరాబాద్ జిల్లాలోని బీసీ అభ్యర్థుల నుంచి 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ కదీవరన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు యూజీసీచే గుర్తించిన విద్య సంస్థ నుంచి "లా" కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలని, అభ్యర్థులు లేదా వారి కుటుంబంలో ఎవరైనా గతంలో ఈ ఉచిత శిక్షణ పొంది ఉండరాదని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. బీసీ-ఏ (1), బీసీ-బీ (2), బీసీ-డీ (1) మొత్తం నలుగురు అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఉపసంచాలకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా 4వ అంతస్తు, స్ఫూర్తి భవనం, లక్డీకాపూల్, హైదరాబాద్ అనే అడ్రస్‌కు ఆగస్టు 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అందజేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వివరాలతోపాటు పాస్ పోర్ట్ సైజు ఫొటో, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జత చేయాలని సూచించారు.

విదేశీ ఉన్నత విద్యపై అవగాహన సదస్సు

బంజారాహిల్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య అవకాశాలను, అక్కడి పరిస్థితులను వివరించేందుకు బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో శనివారం ఐ20 ఫివర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు అపూర్వ స్పందన లభించింది. అమెరికా, ఆస్ట్రేలియాలో ప్రసిద్ధి చెందిన 39 యూనివర్సిటీల ప్రతినిధులు ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొన్నట్లు నిర్వాహకులు నవీన్ యాతపు తెలిపారు. హరిజోన స్టేట్, నార్త్ ఈస్టర్న్, స్టోని బ్రూక్, నార్త్ టెక్సాస్, యూనివర్సిటీ ఆఫ్ టస్మేనియా, ఫిండరస్ యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హరీష్, ప్రదీప్, అరవింద, డ్యులింగో ఇంగ్లిష్ టెస్ట్ ప్రతినిధి కృతి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడిస్తాం

● రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి



రహ్మత్‌నగర్ బూత్ కమిటీ సమావేశంలో వివేక్ వెంకటస్వామి

బోరబండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడిస్తామని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. రహ్మత్‌నగర్ డివిజన్ హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-2 బహుళ ప్రయోజనాల ఫంక్షన్ హాల్లో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహ్మత్‌నగర్ డివిజన్‌లోని ప్రతీ సమస్య తన దృష్టిలో ఉందని, ప్రజల అవసరాలు, అభివృద్ధి పనులు ఎక్కడ ఆగిపోయాయో అక్కడ నుంచే మొదలు పెడతామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఎంత చేరువైతే ఉప ఎన్నికలో అంత సులువుగా గెలుపొందవచ్చని తెలిపారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై తాను వెంటనే స్పందిస్తున్నానని తెలిపారు. మంత్రి వివేక్ సహకారంతో డివిజన్‌ను మరింతగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, యువత, మహిళలు పాల్గొన్నారు.



వాయిసేన విభాగంలో సేవలందించిన వారిని, సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న కోటిరెడ్డి



ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నిర్మాణ ప్రాంగణంలో అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్, ప్రతినిధులు వీణామాధురి, బిల్డర్ రమేష్, బాల్‌కుమార్, రాచప్ప తదితరులు

కార్గిల్ అమరజవాన్లకు నివాళులు

ఎర్రగడ్డ/ఖైరతాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 80 రోజులపాటు వీరోచిత పోరు చేసి కార్గిల్ యుద్ధాన్ని విజయవంతంగా పూర్తి చేసిన భారత సైనికులకు వందనాలు అని లయన్స్ క్లబ్ పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ కోటిరెడ్డి అన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా యుద్ధంలో ప్రాణాలర్పించిన వీర సైనికులకు నివాళులర్పించారు. వాయిసేన విభాగంలో సేవలందించిన వారిని, సీనియర్ సిటిజన్‌లను మోతినగర్ కమ్యూనిటీహాల్లో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనికులు 1999 జూలై 26న ఆపరేషన్ విజయ్ పేరుతో కార్గిల్ యుద్ధాన్ని విజయవంతంగా పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో సోమ రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు, సీనియర్ సిటిజన్లు ఎం.రామచందర్, ఎస్.నాగేశ్వరరావు, టి.సత్యనారాయణ, చంద్రయ్య, జైపాల్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, జి.వి.రెడ్డి పాల్గొన్నారు.

గంగపుత్రుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి



అభివాదం చేస్తున్న గంగపుత్ర చైతన్య సమితి ప్రతినిధులు

పంజాగుట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్.98కి సవరణ ద్వారా గంగపుత్రుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంగళపల్లి శంకర్ గంగపుత్ర డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ అనాదిగా తమ వృత్తి చేపలు పట్టే వృత్తి అని, బెస్త, గూండ్ల, గంగపుత్రతోపాటు మరో 11 కులాలు సంప్రదాయ మత్స్యకారులని, మిగతా వారు కాదని అన్నారు. వారికి వేరే వృత్తులు కూడా ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తీసుకువచ్చిన జీవో నెంబర్. 6/2016, జీవో నెంబర్.4/2022 ఆధారంగా సనాతన సంప్రదాయ మత్స్యకారులమైన బెస్త, గూండ్ల, గంగపుత్రుల కులవృత్తిలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలోకి ఇతర కులాలను అక్రమంగా చేర్చడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ విషయమై న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించామని తెలిపారు. ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా విడుదల చేసిన జీవో.140ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర, స్టీరింగ్ కమిటీ చైర్మన్ పూస సత్యనారాయణ గంగపుత్ర, నాయకులు ప్రవీణ్ గంగపుత్ర, శ్రీకాంత్ గంగపుత్ర, సంతోష్ గంగపుత్ర, రవి గంగపుత్ర, ఎస్.రవీందర్ గంగపుత్ర, శివ గంగపుత్ర, సత్యనారాయణ గంగపుత్ర, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

● ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్ కుమార్

పంజాగుట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి ప్లాట్లు కొనుగోలు చేశాం. ప్రస్తుతం అక్కడ భూమి విలువ పెరగడంతో కబ్జాదారుల కన్ను పడింది. మా ప్లాట్లను కబ్జా చేస్తున్నారు. నోటరీ, జీపీఏ చేసి వాటిని తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఆ ప్లాట్లలో భవనాలు నిర్మిస్తున్నారు. మేము వెళ్తే చంపేస్తామని బెదిరిస్తున్నారు.' సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సందీప్ కుమార్ విజ్ఞప్తి చేశారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావును కలుస్తామని ఆయన తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ సలహాదారు సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు రామ్మూర్తి, కోశాధికారి కె.రమేష్, సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామం సర్వే నెంబర్లు 119 నుంచి 220 వరకు ఉన్న 495 ఎకరాలలో ఏర్పాటు చేసిన లేఔట్ లో తాము 1984, 85 ప్రాంతంలో స్థలాలను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి హరీష్‌రావు పేరు చెప్పుకుని ఓ న్యాయవాది తమ ప్లాట్లను కబ్జా చేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా తనకు అండగా ఉందని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ప్రస్తుతం ప్లాట్ల విలువ బాగా పెరిగిందని, కబ్జాదారుల చెర నుంచి విడిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు హరికృష్ణ, రవికాంత్ రెడ్డితోపాటు పలువురు బాధితులు పాల్గొన్నారు.

మహిళా కౌన్సెలింగ్ నిపుణులకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న మహిళలు

హైటెక్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మహిళలకు శిక్షణ ఇవ్వడంతోపాటు కౌన్సెలింగ్, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం అంత ఈజీ కాదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం మాదాపూర్‌లో వివిధ విభాగాల్లో శిక్షణ, కౌన్సెలింగ్ ఇచ్చే మహిళామణులకు 'ఉమెన్ కోచ్ అండ్ కౌన్సిలింగ్- 2025' పేరుతో గోల్డెన్ ఫిష్ కమ్యూనికేషన్ పురస్కారాలను అందజేసింది. అతిథులుగా వర్చుసా వైస్ ప్రెసిడెంట్ కృష్ణ యొదులా, హెచ్ఎస్‌బీసీ నుంచి మమత మదిరెడ్డి హాజరయ్యారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 21 మంది మహిళలకు అవార్డులను అందజేశారు. గోల్డెన్ ఫిష్ కమ్యూనికేషన్ వ్యవస్థాపకురాలు గీతికా బత్రా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వినయ్ అగర్వాల్, సమీక్ష అరోర, టీఆర్‌ఎల్ రావు, పద్మప్రియ చిలమర్తి, విశాల్‌రెడ్డి, ప్రవీణ్ తోట, అర్చన సురేష్, అనుపమ దాల్మియ, దేవాన్ష్ తదితరులు పాల్గొన్నారు.



ఆలుగడ్డబావి ఆర్‌యూబీ వద్ద వర్షపునీరు వెళ్లే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు

- ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్

బౌద్ధనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆలుగడ్డబావి ఆర్‌యూబీ వద్ద వర్షపునీరు నిలిచిన ప్రాంతాన్ని ఏసీపీ ఎ.శ్రీనివాస్, చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులతో కలిసి సందర్శించారు. ఇటీవల కురుస్తున్న వర్షంతో ఆలుగడ్డబావి ఆర్‌యూబీ వద్ద వర్షపునీరు నిలిచి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని ఇన్‌స్పెక్టర్, డీసీపీ దృష్టికి తీసుకువచ్చారు. భవిష్యత్తులో ఈ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆలుగడ్డబావిలో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసేలా జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్‌కు లెటర్ రాయాలని డీసీపీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న భానుక నర్మద

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

సికింద్రాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధి 8వ వార్డు బొల్లారం ఆదర్శనగర్‌లో కంటోన్మెంట్ బోర్డు నిధులతో రూ. 12.5లక్షలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదర్శనగర్‌లో సుమారు మూడువందల కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరిలో కంటోన్మెంట్ కర్మచారులే ఉండటం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ 8వ వార్డు అధ్యక్షులు ప్రవీణ్, నాయకులు ఎంఎస్ కిరణ్, జెవి నర్సింగరావు, ధనుంజయ్‌చారి, ప్రవీణ్‌యాదవ్, వినోద్, ధనరాజ్ పాల్గొన్నారు.



లాన్స్ నాయక్ ఎంవై రామచందర్ విగ్రహానికి నివాళులర్పించిన బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుకా నర్మదా మల్లిఖార్జున్, కుటుంబ సభ్యులు

లాన్స్ నాయక్ రామచందర్‌కు నివాళులు

మారేడుపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు బొల్లారం బజార్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. బొల్లారం ప్రాంతానికి చెందిన జవాన్ రామచందర్‌రావు దేశరక్షణ కోసం శత్రువులతో పోరాడి కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందారు. కాగా బొల్లారం బజార్ చౌరస్తాలోని రామ్ చందర్‌రావు విగ్రహానికి కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మద మల్లిఖార్జున్‌తో పాటు బోర్డు అధికారులు, రామచందర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో తలసేమియా అండ్ సికిల్‌సెల్ సొసైటి సహకారంతో రవికిరణ్, మహేష్ అధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరమరణం పొందిన లాన్స్ నాయక్ దేశానికి చేసిన సేవలు, ధైర్య సాహసాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, ధనంజయ చారి, స్థానికులు పాల్గొన్నారు.



పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో రోడ్డు భద్రతపై పికెట్ బస్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

మారేడుపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్, సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం పికెట్ బస్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి నార్త్ వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ 1 సి.వేణుగోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. టీటీఐ బేగంపేట్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం అంటేనే సురక్షిత ప్రయాణం అన్నారు. డ్రైవర్ ఎల్లప్పుడూ జాగ్రత్తగా బస్సును నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీలు మరో పోరాటానికి సిద్ధం కావాలి

తార్నాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలును అడ్డుకోవాలని యత్నిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా బీసీలు మరో పోరాటానికి సిద్ధం కావాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి యాదవ్ అన్నారు. కేంద్రం దశాబ్ద కాలంగా కులతత్వ, మతతత్వ, కార్పొరేట్ రాజకీయాలను ప్రోత్సహిస్తూ, బడుగు బలహీనవర్గాలను అణిచివేసేందుకు కుట్రలు చేస్తుందని తీవ్రంగా మండిపడ్డారు. సామాజిక సాధికారితను అందించే రిజర్వేషన్లు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల పాలనలో ప్రమాదంలో చిక్కుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర సెక్రటరీ కటికల శ్రీహరి ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్ కోకటి, కార్యవర్గ సభ్యులు మహమ్మద్ రిజ్వాన్ హుస్సేన్, మహ్మద్ వజీద్ సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఎఫ్ రన్నరప్‌గా సాయికార్తీక్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ టూర్ ఐటీఎఫ్ 15కే టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ గంట సాయికార్తీక్ రెడ్డి-టొమోహిరో మసబయాషి (జపాన్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. థాయ్‌లాండ్‌లో జరిగిన ఈ పోటీల ఫైనల్‌లో సాయికార్తీక్ జోడీ 3-6, 3-6తో సంగ్ చుంగ్-క్వాన్ (దక్షిణ కొరియా) ద్వయం చేతిలో ఓడిలో రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్నారు. సాయికార్తీక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి.



ట్రోఫీతో సాయికార్తీక్ ద్వయం

నేడు, రేపు బోనాల సందడి



దండుమారమ్మ ఆలయం



పూలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్న దృశ్యం

బాలంరాయి దండుమారమ్మ..

సికింద్రాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు జంట నగరాల్లో సుప్రసిద్ధి చెందిన బాలంరాయి దండుమారమ్మ అమ్మవారి బోనాల జాతర ఆది, సోమవారం రోజుల్లో వైభవంగా, కనుల పండువగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారికి పూజలు చేస్తే.... కోరిన కోర్కెలన్నీ తీరుస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే సికింద్రాబాద్ కంటోన్మెంట్ తోపాటు బేగంపేట్, మారేడుపల్లి, రాంగోపాల్‌పేట్, రాణిగంజ్, సీతాఫల్‌మండి, బాలానగర్, సనత్‌నగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఆలయానికి తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుంటారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా బోనాల జాతరను అత్యంత వైభవోపేతంగా జరపడానికి దేవాదాయ శాఖ అధికారులు ఆలయానికి రంగులు వేసి, పూలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే బోనాలు సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నందున ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సోమవారం ఉదయం జరిగే రంగం(భవిష్యవాణి) కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజుల పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తజన మండళ్లు, యువజన సంఘాలు నిర్వహించే ఫలహార బండ్లు, తొట్టెల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకోనున్నాయి.

జాతరను పురస్కరించుకుని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు చుట్టు పక్కల పారిశుధ్య నిర్వహణ పనులను మరింత ముమ్మరం చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారి ఉమాశంకర్, హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, శానిటరీ సూపరింటెండెంట్ మహేందర్, వాటర్ సెక్షన్ సూపరిండెండెంట్ రాజ్‌కుమార్ తదితర అధికారులు, సిబ్బంది ఆలయం, పరిసరాల్లో ఈ పాటికే పలుమార్లు పర్యటించారు.



రేణుకా ఎల్లమ్మ ఆలయం

అడ్డగుట్ట వడ్డెరబస్తీలో..

అడ్డగుట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట వడ్డెరబస్తీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి నలభై ఏళ్ల చరిత్ర ఉంది. ఈ బస్తీకి చెందిన సమాజ సేవకుడు ప్రజల ఆపద్బాంధవుడు, స్వర్గీయ దండుగుల సాయిలు కుమారులైన వెంకటస్వామి, మోహన్‌లు ఆలయానికి ధర్మకర్తలుగా ఉన్నారు. ప్రతి ఏటా బోనాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆదివారం తెల్లవారు ఝామున మొదలయ్యే ప్రత్యేక పూజల్లో మహిళలు బోనం ఎత్తుకుని దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. మరుసటి రోజు పూజలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. రేణుక ఎల్లమ్మ ఆలయంలో బోనాలు అంటే ఈ ప్రాంత వాసులకు ప్రత్యేకత. సోమవారం రాత్రికి తమిళనాడు, ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారులు దాదాపు యాభై గ్రూపులుగా వచ్చి ఇక్కడ నృత్యాలు చేసుకుంటూ అమ్మవారి దర్శనం చేసుకుంటారు. అడ్డగుట్ట నుంచి తుకారాం గేట్ వరకు ఫలహార బండ్లతో ఊరేగింపుగా వెళ్లి తిరిగి ఆలయానికి చేరుకుంటారు.



అడ్డగుట్ట వడ్డెరబస్తీ చౌరస్తాలో ఆలయ ముఖ ద్వార లైట్లు

హైడ్రా కమిషనర్‌కు ఆహ్వానం

అడ్డగుట్ట వడ్డెరబస్తీలో రెండు రోజుల పాటు జరిగే బోనాల జాతరకు రావాల్సిందిగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఆలయ ధర్మకర్తలు వెంకటస్వామి, మోహన్‌ల బృందం శనివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆహ్వానాన్ని అందజేశారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతుండడంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.




హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వెంకటస్వామి, మోహన్‌లు



సీతాఫల్‌మండి మేడిబావిలో ముస్తాబైన పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయం

సీతాఫల్‌మండీ మేడిబావిలో..





ఆలయంలో కొలువుదీరిన పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు

బౌద్ధనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి మేడిబావిలోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం బోనాలు ఘనంగా జరగనున్నాయి. ఆలయాన్ని ఇప్పటికే విద్యుత్ దీపాలతో సుందరంగా అలకరించారు. ఆది, సోమవారం జరిగే వేడుకల్లో ఇరవై ఫలహారబండ్లు, తొట్టెల ఊరేగింపుతో పాటు రంగం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్, సనత్‌నగర్ శాసనసభ్యులు తీగుల్ల పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్లు సామల హేమ, కందిశైలజ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, చైర్మన్ కళాప్రకాశ్‌లు తెలిపారు. ఆలయం వద్ద భారీబందోబస్తును ఏర్పాటు చేశామని ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు.

ఆలయ చరిత్ర

సుమారు వంద సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించారు. సీతాఫల్‌మండి రామేలింగేశ్వర స్వామి ఆలయానికి ఈ ఆలయం ఉప ఆలయంగా కొనసాగింది. తర్వాత 1997లో ఆలయచైర్మన్ పరికిబండ కళాప్రకాశ్ పోచమ్మ, ముత్యాలమ్మ పోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఆదివారం తెల్లవారుజామున తమ కుటుంబం తొలి బోనం సమర్పించిన అనంతరం బోనాల వేడుకలు ప్రారంభం అవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భక్తులు ఇబ్బందులు పడకుండా..

బోనాల వేడుకల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఆలయ చైర్మన్ పరికిబండ కళాప్రకాశ్ తెలిపారు. మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు, ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. వేడుకలకు భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

- పరికిబండ కళాప్రకాశ్, చైర్మన్

ట్రాఫిక్‌కు అడ్డుగా వృక్షం.. తరలించేందుకు ప్రణాళిక

అడ్డగుట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అత్యంత రద్దీగా ఉండే సికింద్రాబాద్, రోడ్ల పక్కన అడ్డంగా ఉన్న భారీ వృక్షాలను మరో ప్రదేశానికి తరలించేందుకు ప్రణాళిక కోసం పరిశీలిస్తున్నామని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు తెలిపారు. శనివారం సాయంత్రం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ సమీపంలోని తాజ్‌మహల్ హోటల్ ముందు ఉన్న భారీ వృక్షం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో దీనిని తరలించేందుకు ఫారెస్ట్, హార్టికల్చరల్ అధికారులు పరిశీలించామన్నారు. ప్రతి నిత్యం ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో ఈ వృక్షాన్ని పక్కనే ఉన్న మహబూబ్ కాలేజీ ఆవరణలోకి తరలించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఘటన స్థలంలో అర్బన్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ కుమార్, ఫారెస్ట్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సికింద్రాబాద్ అగ్రికల్చరర్ ఆఫీసర్, మేనేజర్లు, సూపర్‌వైజర్లు సత్యనారాయణ, చంద్రశేఖర్‌లు పరిశీలించిన అనంతరం రెండు మూడు రోజుల్లో అనుమతి రాగానే వృక్షానికి పూజలుచేసి ఇక్కడి నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న హార్టికల్చరల్ కాలేజీ ఆవరణలో పెట్టి మరలా పూజలు చేసి నాటనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యపై అనేక ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.



భారీ వృక్షాన్ని మరో ప్రదేశానికి తరలించేందుకు పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజుతో పాటు ఇతర అధికారులు



సంజీవపురంలో మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కందిశైలజ

సంజీవపురంలో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ సంజీవపురం, న్యూఅశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో శనివారం స్థానిక కార్పొరేటర్ కంది శైలజ అధికారులతో కలిసి పర్యటించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌ను వారు పరిశీలించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని, నాలా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ లావణ్య, నాయకులు శ్రీకాంత్, రాజేశ్వర్‌గౌడ్, ఆంజనేయులు, కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

చంపుతామని బెదిరింపు

- మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

రెజిమెంటల్‌బజార్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, గబ్బర్ సింగ్ ఫేం సాయిబాబా తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, శనివారం సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి తాము వైఎస్‌ఆర్‌సీపీకి చెందిన వారమని, మాజీమంత్రి రోజా మనుషులమని చెబుతూ చంపేస్తామని బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించాడు. రెండు రోజుల క్రితం విడుదలైన హరి హర వీరమల్లు సినిమా అనంతరం సాయిబాబా మీడియాతో మాట్లాడుతూ రోజాపై అనుచిత వాఖ్యలు చేశాడు. ఇది వైరల్ కావడంతో వైసీపీ నేతలు, రోజా అభిమానులు సాయిబాబాకు ఫోన్ చేస్తూ చంపుతామని బెదిరించారు. దీంతో మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో సాయిబాబా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి, రక్షణ కల్పించాలని కోరారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరికైనా మనసుకు బాధ కలిగితే తనను క్షమించాలని కోరారు. పవన్ కల్యాణ్‌పై మాజీమంత్రి రోజా అనుచిత వాఖ్యలు చేయడం వల్లే తాను నోరు జారానని సాయిబాబా స్పష్టం చేశారు.



మార్కెట్ పోలీస్‌స్టేషన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న సాయిబాబా

లా పూర్తి చేసిన వారికి ఉచిత శిక్షణ

- ఆగస్టు 10 వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'లా' పూర్తి చేసిన అభ్యర్థులకు మూడేళ్ల ఉచిత శిక్షణ ఇవ్వడానికి హైదరాబాద్ జిల్లాలోని బీసీ అభ్యర్థుల నుంచి 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ కదీవరన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు యూజీసీచే గుర్తించిన విద్య సంస్థ నుంచి "లా" కోర్స్‌లో ఉత్తీర్ణులై ఉండాలని, అభ్యర్థులు లేదా వారి కుటుంబంలో ఎవరైనా గతంలో ఈ ఉచిత శిక్షణ పొంది ఉండరాదని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. బీసీ-ఏ (1), బీసీ-బీ (2), బీసీ-డీ (1) మొత్తం నలుగురు అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఉపసంచాలకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా 4వ అంతస్తు, స్ఫూర్తి భవనం, గ్లోబల్ హాస్పిటల్ పక్కన, లక్డీకాపూల్, హైదరాబాద్ అనే అడ్రస్‌కు ఆగస్టు 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అందజేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వివరాలతో పాటు పాస్ పోర్ట్ సైజు ఫొటో, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జత చేయాలని సూచించారు.

మెడికల్ కోడింగ్‌లో శిక్షణ, ఉపాధి

చిలకలగూడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు అప్సొటెక్ మహీంద్ర మెడికల్ కోడింగ్‌లో శిక్షణ-ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు హబ్సిగూడ సమన్వయకర్త పురుషోత్తం గోపి ఒక ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 27 సంవత్సరాల వయసు గల సైన్స్, కామర్స్ బీఫార్మసీ గ్రాడ్యుయేట్లకు శిక్షణ యిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆసక్తిగలవారు వివరాలకి 9154990132, 9154990130, 9154990131 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

సూర్యానికి ఓయూ డాక్టరేట్



సూర్యం (ఫైల్)

తార్నాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా లింగంపేట మండలానికి చెందిన నీరడి సూర్యం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను పొందారు. ఓయూలోని కెమిస్ట్రీ విభాగంలో డా.కొత్త లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో సింథసిస్ క్యారెక్టరైజేషన్, ఆప్టికల్, మాగ్నెటిక్ ప్రాపర్టీస్, ఫొటో క్యాటలిటిక్ అండ్ బయలాజికల్ యాక్టివిటీ ఆఫ్ మాంగనీస్, ఎటర్బియం, యట్రియం, నియోడైమియం అండ్ డిస్ప్రోసియం డోప్డ్ కోబాల్ట్ నానోఫెర్రైట్స్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకుగాను డాక్టరేట్ పట్టాను అందుకోవడం జరిగిందని శనివారం ఆయన తెలిపారు. తన పరిశోధనకు సహకరించిన కుటుంబ సభ్యులు, ప్రొఫెసర్లు, తోటి పరిశోధనా విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

బోయినపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తాత, అమ్మమ్మ, నాయనమ్మల గ్రాండ్ పేరెంట్స్ డే దినోత్సవం అనేది తాతా మనవలు, మనవరాళ్ల మధ్య బంధాన్ని తెలియజేయడానికి జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు శనివారం సికింద్రాబాద్ బోయిగూడలోని అనాథ వృద్ధాశ్రమంలో బోయినపల్లి సెయింట్ పీటర్స్ పాఠశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆల్ఫోన్స్ రెడ్డి మాట్లాడుతూ నేటితరంలో కనుమరుగవుతున్న బంధాలను దృఢ పర్చుకునేలా తమ పాఠశాల విద్యార్థులకు నేర్పించడమే తమ లక్ష్యమని అన్నారు.

ముందు తరాలు, వాటి మూల కారకులైన అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యలతో ఎలా మెలగాలో విద్యార్థులకు గుర్తు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అరుణ రెడ్డి, ప్రిన్సిపాల్ సువర్ణ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు తాతలు, నాయనమ్మలు, అమ్మమ్మలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు

మారేడుపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడానికి, వారిలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయాలనే సంకల్పంతో రుక్మిణీ బాయ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పి.జ్యోతి మధుసూధన్‌రావు, శ్రీఅకాడమిక్ డైరెక్టర్ ఎంఎం ఆగస్టీన్, ప్రముఖులు ఆచార్య వి.వెంకట్, సిహెచ్ అరవింద్, ఏవి విజయ శంకర్, ప్రిన్సిపల్ సుజాతలు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీకాంత్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు కోచ్‌లు, అంపైర్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

5 లక్షల మంది పేదలకు ఇళ్లు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 5 లక్షల మంది పేదలకు ఇళ్లు కట్టించేందుకు సిద్ధంగా ఉందని ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నగర శివారు పెద్దఅంబర్‌పేట్‌లోని తారా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 10,050 మంది లబ్ధిదారులకు మంజూరీ అయిన కొత్త రేషన్ కార్డులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూధన్‌రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.